# నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

3 | నిజామాబాద్, శుక్రవారం 10 మే 2024 | KAMAREDDY




కోనాసముందర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

## హామీలపై కాంగ్రెస్, బీజేపీని

# నిలదీయండి

- అబద్ధాల సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధిచెప్పండి
- ఐదేండ్లయినా హామీలను పట్టించుకోని మోదీ సర్కార్
- బీఆర్‌ఎస్‌ను గెలిపించండి.. హామీల అమలు కోసం ధర్నా చేస్తా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మే 9: ఓట్లు దండుకోవడానికి హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలను నిలదీయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు, పదమూడు హామీలు అమలు చేస్తామని చెప్పి ఐదునెలలు గడుస్తున్నా రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని, పసుపు, చెరకు, ఎర్ర జొన్నలకు మద్దతు ధరను ఇప్పిస్తామని చెప్పి ఐదేండ్లు గడుస్తున్నా పట్టించుకోని బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్, నర్సాపూర్, కోనాపూర్, కోనాసముందర్ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. మోసపూరిత హామీలతో ఇప్పటికే ఒకసారి మోసపోయారని, మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అదే జరుగుతుందని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, పదమూడు హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం తప్ప మిగితావి ఏ ఒక్కటీ అమలుచేయలేదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌కు ట్యాబ్ ద్వారా చూపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను హామీల ఆశల పల్లకీలో ఊరేగించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సురుకు పెట్టాలన్నారు.

**గ్రామాల ముఖం చూడని అర్వింద్**

ఐదేండ్లు ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ ఒక్కసారికూడా గ్రామాలకు రాలేదని, పనుల కోసం నిధులు కూడా మంజూరు చేయలేదని వేముల మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఒక్కసారి కూడా మన గ్రామాలకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. అలాంటి వారికి ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పింఛన్ ఎన్నో రెట్లు పెంచినట్లు గుర్తుచేశారు. ప్రజల కోసం పోరాడే బాజిరెడ్డిని గెలిపిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు అసెంబ్లీ వద్ద ధర్నా చేయడానికి కూడా తాను సిద్ధమేనని స్పష్టం చేశారు.

**రైతుబంధు ఎందుకు ఆగిపోయిందో ఆలోచించాలి**

రైతుబంధు ఇవ్వాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసిందని తెలిపారు.ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు ఇవ్వమని చెప్పామని, బీఆర్‌ఎస్ డిమాండ్‌తో కొంతమందికి మాత్రమే రైతుబంధు ఇచ్చి వాళ్లే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు వచ్చేలా చేసి రైతుబంధును ఆపివేశారని ఆరోపించారు. రూ.15వేలు రైతుబంధు ఇస్తానని ఎకరం ఉన్నవారికి ఇవ్వడానికి నెలరోజుల పట్టిందని, ఇచ్చిన హామీలన్నీ 155రోజులు అవుతున్నా అమలు ఊసేలేదని అన్నారు. అర్వింద్ స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువకులకు శిక్షణను ఇప్పించి ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చి ఎందుకు మరిచిపోయాడో ప్రశ్నించాలన్నారు.



### కాంగ్రెస్..రైతుల పాలిట శాపంగా మారింది..

డిచ్‌పల్లి, మే 9: కాంగ్రెస్ సర్కారు రైతుల పాలిట శాపంగా మారింది. కాలమైనంక ఆన పడ్డట్లు కోతలైనంక రైతుబంధులిస్తున్నారు. రైతులకు ఊపిరి పోసిన రైతుబంధు కేసీఆర్ పాలనలో షురు అయినప్పటి నుంచి ఇంత గడ్డుకాలం ఎన్నడూ ఎదురుగాలే. నాకు ఆరెకరాల భూమి ఉంది. ఈ యాసంగిలో వరి పంట వేసిన, పంట పెట్టుబడి ఖర్చుల కోసం అప్పు తీసుకొచ్చాను. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు రైతుబంధు డబ్బులు సాగుకు ముందుగానే అచ్చినాయి. ఇప్పుడేమో వరి సీజన్ అయ్యాక ఇస్తున్నది. నాకున్న ఆరు ఎకరాల్లో ఒక్క ఎకరాకు రైతుబంధు రాలేదు.

**-గంగారాం, రైతు, పాల్దా, నిజామాబాద్ రూరల్ మండలం**

### రైతుబంధు ఇంకెప్పుడిస్తరో..?



బోధన్, మే 9: కేసీఆర్ హయాంలో రైతుబంధుతో మా కష్టాల తీరినయ్. సాగునీటి ఇబ్బందులు లేకుండా పోయినయ్.. టైమ్‌కు రైతుబంధు మా ఖాతాల్లో పడుతుండె.. దీంతో అప్పుల కోసం తిరుగుడు బంద్ చేసినం.. రైతుబంధు పైసలతో విత్తనాలు, మందులు, ఎరువులు కొనేవాళ్లం.. నాట్లకు, పనులకు కూలీలకు కూలీలు రైతుబంధు డబ్బుల నుంచే ఇచ్చేవాళ్లం.. నాకు ఆరు ఎకరాలు ఉంది. ఈ ఆరు ఎకరాల్లో ఏడేండ్ల పాటు పంటలు వేసుకుని.. కష్టాల నుంచి గట్టెక్కిన.. ఇప్పుడు పరిస్థితి ఇలా లేదు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పైసలు ఎప్పుడిస్తదో.. అసలు ఇవ్వదో తెలియడంలేదు.. రైతుబంధు ఇవ్వకపోతే.. మాలాంటి రైతులు గోస పడకతప్పదు.

**-మోరే విశ్వంబర్, రైతు, టాక్లీ, కోటగిరి మండలం**



### కాంగ్రెస్ వచ్చిన్నుంచి కష్టాలే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలే ఉన్నాయి. సాగు సమయంలోనే రైతు బంధు సాయం అందిస్తే మాకు ఉపయోగపడుతుంది. ఎప్పుడంటే అప్పుడు, కోతలు పూర్తయ్యాక ఇస్తే ఏం లాభం. కేసీఆర్ పాలనలో రైతుబంధు కరెక్టు టైంకు పడుతుండే. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి మాకు కష్టాలే ఎదురవుతున్నాయి. సమయానికి సాయం చేస్తేనే రైతులకు న్యాయం చేసిన వాళ్లవుతారు. లేకపోతు వచ్చే రోజుల్లో రైతులు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పరేషాన్ల పడుడు ఖాయం.

**- దుర్గారెడ్డి, రైతు, కొల్లూర్, బాన్సువాడ మండలం**

## రైతుబంధుకు కొర్రీలు

# అన్నదాతల్లో గుబులు

**ఇన్నాళ్లూ** రంది లేకుండా నడిచిన ఎవుసం.. మళ్లీ భారమవుతున్నది. సాగు కోసం మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. కేసీఆర్ హయాంలో సాగు మొదలు వెట్టక మునుపే రైతుబంధు పైసలు ఖాతాల పడేటివి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యాసంగిలో పడాల్సిన పెట్టుబడి పైసలు సాగు పూర్తయినా రాలేదు. మొదటి సీజన్‌లోనే రైతుభరోసా వేయని వాళ్లు... ఇక వచ్చే సీజన్‌కు ఏం వేస్తారు. దీంతో అప్పులు చేయకతప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతుకు అండగా ఉంటామంటూనే మా నెత్తిన అప్పుల బండలు వేశారు. ఇకమీదట ఐదెకరాల వరకే పెట్టుబడి సాయం చేస్తామంటున్నారు. ఐదు ఎకరాలకు పైబడి ఉన్నవాళ్లమంతా రైతులం కాదా? మాకేం ఇబ్బందులుండవా? అంటూ అభిప్రాయపడుతున్నదీ ఉమ్మడి జిల్లా రైతాంగం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పరిస్థితి అంతా అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇసుంటోళ్లకు మళ్లీ ఓటేస్తే ఎవుసాన్ని దండుగ అంటారని అలాంటోళ్లకు ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్తాం. రైతుకు ఎలాంటి రందీ లేకుండా చూసిన కేసీఆర్ వైపే ఉంటామని పేర్కొంటున్నారు.

**పంట పండిస్తేనే రైతుభరోసా ఇస్తారట!**

- పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకు సర్కారు సన్నాహాలు
- మళ్లీ పదేండ్ల కిందటి పరిస్థితులు పునరావృతం!
- సాగుకోసం అప్పులు చేస్తున్న రైతులు
- కేసీఆర్ ఉన్నప్పుడే రంది లేకుండె..
- రైతుబాధలు అర్థం చేసుకున్నది కేసీఆర్ ఒక్కరే..
- నమ్మించి మోసం చేసిన కాంగ్రెసోళ్లకు బుద్ధి చెప్తాం



### రైతులు మళ్లీ అప్పుల పాలవుతున్నరు..



ఎల్లారెడ్డి రూరల్, మే 9: రైతుల కష్టాలు తెలిసినవాడు, రైతు బాంధవుడు కేసీఆర్ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైతుబంధు ఇచ్చి రైతులకు ఆదుకున్నాడు. కానీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడంలేదు. రైతుబంధు అనేది పంట వేసే మొదట్లోనే రైతుకు అందజేసే సాయం, కానీ దానిని రైతు పూర్తిగా అప్పుల పాలైన తర్వాత పంట కోతకు వచ్చిన సమయంలో ఇచ్చేది కాదని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ మాత్రం తెలియదా..పడి ఆకలి తీర్చుకున్న తర్వాత అన్నం పెట్టి లాభమేంటి. రైతుబంధు సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు మళ్లీ అప్పులపాలవుతున్నరు.

**-పాశం రాంరెడ్డి, రైతు, అల్మాజీపూర్**

### ఎన్ని ఎకరాలున్నా రైతే..



బోధన్, మే 9: సీఎం, మంత్రులు ఐదెకరాల వరకే రైతుబంధు ఇస్తామని ప్రకటనలు చేస్తూ టెన్షన్ పెడుతున్నరు. ఐదెకరాలు, పదెకరాలు, ఇరవై ఎకరాలున్నా.. రైతు రైతే. నాకు పదెకరాల భూమి ఉంది. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తారు.. అప్పులు ఇప్పిస్తారు. మాలాంటి రైతుల గురించి ఆలోచించరు.. రైతుల గురించి ఫస్ట్‌టైమ్ ఆలోచన చేసింది కేసీఆర్ సారే.. కాంగ్రెస్ ప్రభుత్వం 5 ఎకరాల వరకే రైతుబంధు ఇస్తామని చెప్పడం సరికాదు.

**-బీర్కూర్ శ్యామ్‌కుమార్, రైతు, కోటగిరి**



### బిచ్కుందలో షిండే ప్రచారం..

జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే గురువారం బిచ్కుందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ధర్నా చేస్తున్న రైతులు



మార్కెట్ యార్డులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

## తడిసిన ధాన్యం..

# రోడ్డెక్కిన రైతాంగం

### పచ్చి వడ్లు కొనుగోలు చేయాలని నిరసన

కామారెడ్డి, మే 9: రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రామారెడ్డి చౌరస్తా వద్ద గురువారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో తీసుకొచ్చిన వడ్లు మార్కెట్ యార్డులోనే ఉండిపోయాయని, బుధవారం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయిందన్నారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. అధికారులు వచ్చి ధాన్యం సకాలంలో కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది

- గులాబీ జెండా.. తెలంగాణకు అండ
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

కోటగిరి, మే 9: రాష్ట్ర ప్రజలకు మేలు చేసిన బీఆర్‌ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉన్నదని, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎత్తిన గులాబీ జెండా తెలంగాణకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఐదునెలల్లోనే వ్యవసాయ రంగాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. ఉమ్మడి కోటగిరి మండలంలోని శ్రీనివాసకాలనీ, లింగాపూర్, కల్లూర్, జల్లాపల్లి అబాది, జల్లాపల్లి ఫారం, పాతంగల్,ఎత్తొండ, దోమలెడ్గి, కోటగిరిలో బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అధికారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అమలు చేయలేక చేతులెత్తేశాడని ఎద్దేవా చేశారు. పొలాలు ఎండగొట్టిన కాంగ్రెస్ సీఎం ఏం ముఖం పెట్టుకొని రైతుల ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. జహీరాబాద్ ఎంపీలుగా బీబీపాటిల్, సురేశ్ షట్కార్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో వచ్చిన గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శంకర్‌పటేల్, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సిరాజ్, మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, నీరడి గంగాధర్, పత్తి లక్ష్మణ్, కూచి సిద్దూ, అనిల్, హౌగిరావు పటేల్, శ్రీధర్, గంట్ల విఠల్, లింగప్ప, వెంకట్‌రెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# ఆశీర్వదించండి.. ప్రజల్లో ఉంటా..

ఆర్మూర్‌టౌన్, మే 9: హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పి, తనను ఆశీర్వదించాలని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలకు వారెంటీ అయిపోయిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన పట్టణంలోని ఆలూర్ రోడ్ నుంచి గోల్‌బంగ్లా వరకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు నెలలైనా హామీలను నెరవేర్చలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి మోసగించేందుకు అబద్ధాలను ప్రచారం చేస్తూ, కుట్రలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగు, తాగు నీటి సమస్యలతో పాటు కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తాను పక్కా లోకల్ నాయకుడినని, తనను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.



ఆర్మూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్